


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -147-

**(7 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**గత వ్యాసంలో వేలం** పాటల్ని గురించి కొంతవరకు వ్రాశాం. మరి కొన్నిటినిక్కడ వివరిస్తాను.

ఉద్యోగాల విషయం ఆలోచించండి. అభ్యర్థి అర్హతలనిబట్టి ఎక్కడ వస్తున్నాయి ఉద్యోగాలు? ఇక్కడ కూడా వేలం పాట తప్పడం లేదు. అయితే ఈ వేలం పాటకు "పలుకుబడి" చెలామణి అవుతోంది. ఇవ్వాళ ఒక సిఫార్సు. రేపు మరొకటి.

ఇలా రోజు రోజుకీ హెచ్చిపోయే సిఫార్సులలో పెద్దదాని పేర ఆ ఉద్యోగం కొట్టివేయబడుతోంది. తక్కినవారి ఆశలు, అర్హతలూ అన్నీ సభానంతరం చాపలు చుట్టి మూలపెట్టినట్లు పెట్టి వేయబడుతున్నాయి.

ముందుగా ఫలానా, ఫలానా అర్హతలున్న వాళ్ళు అర్జీలు పెట్టుకోవచ్చు. ఫలానా తారీకు లోపల అర్జీలు అందాలి. యోగ్యతా పత్రాలుంటే పంపవచ్చు అని పత్రికలలో ప్రకటనలు చేస్తారనుకోండి. ఎంత చేసినా వేలం పాట తప్పదు.

"ఉద్యోగాలు ఇస్తాం ఇస్తాం" అని గందరగోళం చెయడమేగాని, ఎవరికి ఇచ్చేది? దేన్ని బట్టి ఇచ్చేది అన్న విషయాలు ఆలోచించి కాదు. "ఇస్తాం.. ఉద్యోగం ఇస్తాం. ముందుగా సిఫార్సు దొరికిన వారికిస్తాం. తక్కినవాళ్ళంతా సుస్తీ మోహాలతో ఇళ్ళకు పోవలసిందే" అన్నట్లు అవుతుంది చివరికి జరిపే చర్య.

కొన్ని కొన్ని సంస్థల్లో ఉద్యోగాలివ్వాలంటే ఒక నెల జీతం దగ్గరనుంచి ఒక సంవత్సరం జీతందాకా వేలం పాట జరుగుతున్నట్లు చెప్పుకుంటూ వుంటారు. నిరుద్యోగ జీవితంలో మరి కొంత కాలమనుకుని అలా వేలం పాటకు సిద్ధమయ్యేవారు అనేకమంది వున్నారు.

ఇటీవల ఒక గృహస్థు కుమార్తెకు వివాహం చేశాడు. అల్లుడికి అయిదువేలు కట్నం అడిగారు. ఇవ్వడానికి అంగీకరిస్తూ "అయితే మీ అబ్బాయికి ఉద్యోగం లేదు కదా వెంటనే మీరు ఇప్పించినా సరే లేకపోతే నేనిప్పిస్తాను. దానికి కింద రెండు వేలు తగ్గించుకున్నాసరే" అన్నాడుట.

పెళ్ళి కుమారుడి తండ్రి "అంత తొందరలో మేము సంపాదించుకోలేం. మీరే ఇప్పించండి" అన్నాడుట దాని ప్రకారం రెండువేలు తగ్గించుకున్నారట. ఆయనగారూ సొమ్ము తీసుకుని ఉద్యోగం వేలంపాటకు బయలుదేరాడట.

ఇవి "చాటు వేలం పాటలు" క్రింద చలామణి అవుతూ వుంటాయి. ఒక కుర్రవాడే సంస్థలోనన్నా ఉద్యోగం సంపాదించగానే "ఏం ఎంతకు కొట్టేయించుకున్నావు పాట?" అని అడగడం కూడా పరిపాటి అయిపోయింది.

మరో విచిత్రమేమిటంటే పదవులకూ్కడా వేలం పాటలు బయలుదేరినాయి. నేనెరుగున్న పెద్ద మనిషి ఒకాయన పది పదవుల్ని వేలం పాటలో కొట్టేయించుకున్నాడు. ఇప్పటికీ ఠీవిగా అనుభవిస్తున్నాడు. ఆ ప్రాంతంలో పదవుల వేలం పాటలలో ఆయన్ని మించి పాడగల వారు అరుదు. ఆయన ముందే కబురు చేస్తాడు. “అందరికంటే ఇంకో అయిదువందలు ఎక్కువ వేసుకోండి. నాకు చెప్పక్కర్లా" అని.

ఇటీవల పత్రికలో పడింది. అదేదో వూరు పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు పదవికో, దేనికో వేలం పాట పెట్టారనీ, హెచ్చు మొత్తాలిచ్చిన పెద్ద మనిషి పేరు కొట్టివేసి ఆ పదవి ఆయనగారికి కట్టబెట్టదనీ.

ఈ పద్ధతి చాలా బాగుంది. ఎన్నికలూ, లేనిపోని అట్టహాసం కక్షలూ కార్పణ్యాలూ వగైరా లేస్తూ లేకుండా ఒక వెన్నెల రాత్రి అందరూ చెట్టుక్రింద కూర్చుని హాయిగా వేలం పాట పెడితే పెద్ద మొత్తందారుని పేర కొట్టివేయవచ్చు. ఆ సొమ్ము గ్రామం కోసం ఖర్చు పెట్టవచ్చు. ఇలా చెయ్యడం ఉభయతారకంగా వుంటుంది.

కాకపోతే ఎంత ప్రజ్ఞావంతుడైనా, ఎంత నిజాయితీ పరుడైనా, ఎంత పరిపాలనా దక్షుడైనా పదవిలోకి రావడమంటూ వుండదీ పద్ధతి. అమలులోకి వస్తే ఈ వేలం పాటకు అందరూ నిలవగలరామరి? లక్ష్మీదేవి దత్తపుత్రులై వుండాలి.

వోట్ల వేలం అంటూ వుండనే వుంది మనకు. నోట్లకూ, వోట్లకూ అవినాభావ సంబంధం కుదిరి ఎన్నాళ్ళో అయింది. ఇనప్పెట్టెల్లో వున్న నోట్లు, ఉక్కు చేతులలో వున్న నోట్లను కూడా లాక్కువచ్చి బాలెట్ పెట్టెల్లో పారేయిస్తున్నాయి.

రాజకీయపు వేలం పాటల్లో ఇది ముఖ్యమైంది.

రాజకీయ రంగంలో వేలం పాటలు అనేక రకాలు పదవులు, హోదాలు వేలం పాటల్లో పాడి, ఇవ్వాళ ఒక పార్టీలో వున్న వ్యక్తి మర్నాడు మరో పార్టీలో ప్రవేశిస్తున్నాడు అంటే ఏమన్నమాట? వారి దేశభక్తిని విచిత్రమైన వేలం పాటలో పెట్టి అవతలవాళ్ళు తేలిగ్గా తమ పేర కొట్టివేయించుకుంటున్నారు. దీనివల్ల రాజకీయ వేత్తలు అనుకోని అవతారాలు అనేకం ఎత్తవలసి వస్తోంది.

ఈ కాలంలో సలహాలు వగైరాలు కూడా అతిగా లభిస్తున్నాయి. నా దగ్గిర బోలెడు తెలివితేటలున్నాయి. "ఎంతమందికైనా సరే సలహాలిస్తా.. ఎలాటి సలహాలైనా సరే ఇస్తా. అన్ని వేళల్లో ఇస్తా" అని ఎవరికి వారు వేలం పాట

పాడుకోవడం ఎక్కువైపోయింది దేశంలో. ఏం చేస్తారు పాపం. భగవంతుడు అంతులేని తెలివితేటలిచ్చినప్పుడు వాటిని ఇతరులు సరిగా గుర్తించనప్పుడూ?

ఇప్పుడు ఇంకో తమాషా రకం వేలం పాటలు వచ్చాయి. అవి కొందరు రచయితలు కొని రచయితలు పాడే వేలం పాటలు. వీరు వ్రాయడం మాట ఆలోచిస్తారుగాని వ్రాయడం మటుకు జరగదు. అయినా వూరుకోకుండా "వ్రాస్తా....వ్రాస్తా... నే వ్రాస్తా... అద్భుతంగా వ్రాస్తా. అనేక విషయాల మీద వ్రాస్తా" అంటూ వేలంపాట పాడుతూ వుంటారు తమ శేముపిదురంధరతను.

అన్నిటికంటే విచిత్రమైన విషయమేమంటే భక్తులు భగవంతుని దయను కూడా వేలం పాడుతున్నారీ కాలంలో అవసరం వచ్చినప్పుడల్లా ఆ పాటలు ప్రారంభిస్తున్నారు. నడిరోడ్డు మీదా, నట్టింటా కూడా ఏదో ఒక పనికావలసి వస్తుందనుకోండి" నీకే కానుకలిస్తా.. ముమ్మాటికీ ఇస్తా. మూడోసారికల్లా తెచ్చి ఇస్తా" అని పాట పెడుతున్నారాయన దయకు. ఆ పాటకు పోటీ వచ్చేవారెవరూ లేరు గనుక ఆయన పేరనే కొట్టివేస్తున్నారు.

ఈ చిలిపి పాటలకు లొంగుతాడా ఆయన. హృదయ తంత్రులు మీటి భక్తిగానం వినిపిస్తే వింటాడు గాని. ఆయన దగ్గిర పాడాలంటే బ్రతుకుల్నే వేలం పాటపాడాలి. మెచ్చుకుని ఆయనే తన పేరు కొట్టివేయించుకోవాలి.

Post your comments